


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ఎందుకో ఏమో?

**"ఈ దీపకేమైంది?"** పదోసారి అనుకుంది రాధిక.

పొద్దుటినించి ఫోన్ చేస్తున్నా కట్ చేస్తోంది. మెసేజ్ ఇస్తే రిప్లై లేదు. వేళ్ళు లెక్కపెట్టుకుంది రాధిక. పన్నెండు రోజులు! పన్నెండు రోజులనించి దీప తనతో మాట్లాడలేదు.

రమేష్ బంధువులు హాస్పిటల్‌లో చూపించుకోడానికి వచ్చి ఇన్ని రోజులు తమింట్లోనే ఉండటంతో తనూ పట్టించుకోలేదు. ఇవాళ తీరుబడి దొరకగానే దీప గురించి ఆలోచించింది.

రాధికకి గిల్టీగా అనిపించింది. తనని తిట్టుకుంది కూడా.

'పాపం! దానికీ ఈ ఊళ్ళో ఉన్నది తనొక్కతే. తనూ పట్టించుకోకపోతే మరి అలగదూ?' అనుకుంది.

స్కూల్ నించి వచ్చిన చిన్నా తల్లి తనని పట్టించుకోకుండా శూన్యంలోకి చూస్తూండటంతో అడిగాడు. "ఏంటమ్మా అంత సీరియస్‌గా థింక్ చేస్తున్నావ్?"

మామూలుగా అయితే ఆ భాషకి వాడ్ని తిట్టి తర్వాత సమాధానం చెప్పేది. కానీ ఇవాళ అది పట్టించుకోకుండా చెప్పింది.

"దీపాంటీ ఫోన్ తీయడంలేదురా. దాన్ని చూసి పన్నెండు రోజులైంది."

"అవునా? ఇది ఇంటర్నేషనల్ ప్రాబ్లమే. ఉండు అక్కకి చెప్తా." వాడు లోపలికి పరిగెత్తాడు.

"ఏంటమ్మా దీపాంటీ నిన్ను చూడకుండా పన్నెండు రోజులు ఉండగలిగిందా?" బేబీ ఆశ్చర్యంగా అడిగింది.

"అవును" రాధికకి పట్టలేనంత దుఃఖం వచ్చింది.

మొదటిరోజు ఎల్.కెజీ క్లాస్ ఏడ్పులతో మార్మోగిపోయింది. పిల్లలంతా అంటు వ్యాధిలా ఒకళ్ళు ఏడిస్తే, రెండోవాళ్ళు అందుకుంటున్నారు. రాధిక కూడా ఏడుపు లంకించుకోబోతూంటే, పక్కనే ఉన్న దీప చిరునవ్వులు చిందించింది.

"ఎందుకు ఏడుస్తావు? బెల్ కొట్టగానే మీ మమ్మీ వచ్చి నిన్ను ఇంటికి తీసుకెళ్తుంది. ఏడవకు" ఓదార్చింది.

అంతకు ముందు ఆర్నెల్లు నర్సరీకి వెళ్ళిన దీప ఓదార్పుతో రాధిక ధైర్యంగా ఉండగలిగింది. ఆరోజే వారిమధ్య స్నేహం మొదలైంది.

ఇవేమీ వాళ్ళకి గుర్తులేకపోయినా ఇద్దరి తల్లితండ్రులు చిన్నప్పటినించి చెప్తూండటంతో గుర్తుంచుకున్నారు. రాధిక ఎల్.కెజీనించి దీప వెంటే తిరిగేది. దీప ఏం చెప్తే అది వినేది. దీప రాముడైతే, రాధిక ఆంజనేయుడు. అంత భక్తి దీప అంటే.

ఇద్దరూ టెన్త్‌క్లాస్ మంచిమార్కులుతో పాసయ్యాక ఇంటర్మీడియెట్‌కి ఒకే కాలేజ్‌లో చేరారు ఐతే లెక్కలు రాని రాధిక ఆర్ట్స్‌లో చేరింది. దీపని వాళ్ళ నాన్న మేత్స్ గ్రూప్‌లో చేర్పించాడు.

ఆ కో ఎడ్యుకేషన్ కాలేజ్‌లో రాధిక తప్పిపోయిన పసిపిల్లలా దీప వెంటే ఉండేది. తనకి క్లాసులేకుండా, దీపకి ఏ ప్రాక్టికల్సో ఉండి వెళ్తే, ఆమె వచ్చేదాకా లేడీస్ రూంలో బిక్కుబిక్కుమంటూ ఎదురు చూసేది.

బి.ఏ అవగానే రాధికకి పెళ్ళి చేసారు. దీప యం.ఎస్సీలో చేరింది. రాధిక పెళ్ళయి భర్తతో ఢిల్లీ వెళ్ళేప్పుడు తల్లితండ్రులకన్నా, దీపని వదిలి వెళ్ళడానికి విలవిల్లాడింది. రైలు ఎక్కేదాకా దీప చేతిని పట్టుకునే వుంది.

రమేష్‌కి హైదరాబాద్ ట్రాన్స్‌ఫరై రాధిక మళ్ళీ వెనక్కి వచ్చేసరికి ఆమెకి పాపపుట్టింది. దీప తల్లితండ్రులు పెళ్ళిచేసుకోమని ఎంత పోరు పెట్టినా వినకుండా రీసెర్చ్‌లో చేరింది.

దీపని చూసిన రాధిక కన్నీళ్ళతో ఆమెని కౌగలించుకుంది. దీపదీ అదే పరిస్థితి. విజ్ఞానఖనిలా కనిపిస్తున్న స్నేహితురాలి మీద రాధికకి ఆరాధన ఎక్కువైంది. పెళ్ళయి పాప పుట్టినా రాధికలోని అమాయకత్వం తగ్గకపోవడం గమనించిన దీపకి అభిమానం ద్విగుణీకృతం అయింది.

అప్పటినించి వారానికి ఒకసారైనా దీప, రాధిక ఇంటికి వచ్చేది. ఇల్లు సర్దుకునే విషయంలో, పిల్లల పెంపకంలో ఆమెకి సలహాలు ఇచ్చేది. ఆదివారాలు పొద్దున్నే వచ్చేసేది. రాత్రి డిన్నర్ తర్వాత వెళ్ళేది. రాధిక వంటింట్లో పనులతో సమతమయ్యేప్పుడు రమేష్‌తో మాట్లాడుతూండేది. మాటలకంటే వాదులాట అనొచ్చేమో!

బాబు పుట్టాక రాధిక లావైంది. దీప ఓ రోజు ఆమెని అద్దం ముందుకి తీసుకెళ్ళి అడిగింది.

"రాధీ! మనిద్దరం ఒకే ఏజ్ వాళ్ళం. నువ్వెలా ఉన్నావు? నేనెలా ఉన్నాను?" పక్కపక్కనే నుంచున్న ఇద్దరిలో ఒకరు సన్నగా ఫిట్‌నెస్‌తో కనిపిస్తూంటే, మఒకరు లావుగా వయసుకంటే పెద్దగా కనిపిస్తున్నారు.

రాధికకి ఉక్రోషంతో కన్నీళ్ళు వచ్చాయి. మౌనంగా వెళ్ళి సోఫాలో కూర్చుంది.

"రాధీ కోపం వచ్చిందా? ఐ యాం సారీ. నీ మీద కొంచెం శ్రద్దపెట్టాలిగా" దీప అనునయంగా చెప్పింది.

"ఏం పెట్టను? ఇద్దరు పిల్లలు. రమేష్ చిన్న సహాయంకూడా చేయరు. పొద్దున లేస్తే రాత్రి పదింటిదాకా పనులే. ఇంక వాకింగ్‌లు, ఎక్సర్‌సైజులు ఏం చేస్తాను చెప్పు. నాకూ తెలుసు లావైపోతున్నానని. తిండి మానేస్తే పనిచేయలేను. రమేష్ లేవగానే వాకింగ్‌కి వెళ్తారు. నేనూ వెళ్దామంటే పిల్లల్ని వదిలి వెళ్ళలేను" నిస్సహాయంగా చెప్పింది.

"ట్రెడ్ మిల్ కొనుక్కో. టైం ఉన్నప్పుడు ఓ అరగంట నడుస్తూండు. లేదా ఎక్సర్‌సైజ్ బైక్ కొనుక్కో. అరగంట వాకింగ్ కన్నా, అరగంట సైక్లింగ్ బెటర్.."

దీప ఎన్నో సలహాలు ఇచ్చింది. రాధిక అవన్నీ తు.చ తప్పకుండా చేస్తూనే ఉంది. రమేష్‌కి, పిల్లలకి రాధికని చూస్తే నవ్వు. ఇంట్లో ఏ చిన్న మార్పు కనబడినా 'నీ మెంటర్ వచ్చిందా?' 'నీ రాముడొచ్చాడా?' అని వేళాకోళం చేస్తారు.

రాధిక ఉడుక్కుంటుంది. 'అది చెప్పకపోతే నాకు తెలీదా?' అంటుంది. కానీ మానసికంగా దీపమీద ఎంత ఆధారపడిందంటే, 'దీప పెళ్ళిచేసుకుని ఏ అమెరికానో వెళ్ళిపోతే ఎలా?' అని భయపడుతూంటుంది. మళ్ళీ చెంపలు వేసుకుని 'ఛ ఛ!' అది పెళ్ళిచేసుకుని పిల్లాపాపలతో కళకళలాడాలి అనుకుంటుంది.

అలాంటిది దీప ఇన్ని రోజులు రాకపోవడం, కనీసం ఫోన్ కూడా లిఫ్ట్ చేయకపోవడంతో రాధికకి పిచ్చెక్కినట్లుంది. 'వాళ్ళ పేరెంట్స్‌కి ఏం కాలేదు కదా?' అని భయపడింది. కొంపతీసి 'పెళ్ళి చేసేసుకుందా?' ఛ తను లేకుండా దీప పెళ్ళి చేసుకోదు అని సమాధానపడింది.

ఆ సాయంత్రం రమేష్ ఆఫీస్ నించి రాగానే దిగులుగా చెప్పింది.

"దీప వచ్చి రెండు వారాలవుతోంది. ఫోన్ కూడా ఎత్తడంలేదు."

రమేష్ పెద్దగా వికటాట్టహాసం చేసాడు.

"అమ్మయ్య! ఇక నించైనా నువ్వు స్వతంత్రంగా ఆలోచించడం నేర్చుకో"

"ఆ మాటే వద్దంటాను. నేను మరీ అంత వెర్రిదాన్నేం కాదు. నాకు అన్నీ తెలుసు" ఉడుక్కుంది రాధిక.

అదేం పట్టించుకోకుండా రమేష్ పిల్లలతో చెప్పాడు.

"పిల్లలు మీకు ఐస్ క్రీమ్ కొనిస్తా పదండి. దీప మనింటికి రాని శుభసందర్భంలో."

"హుం! దీప మీద మీకింత కోపం ఉందని నాకు తెలీదు" రాధిక ముక్కు చీదింది.

పిల్లలు గలగలా నవ్వారు.

"లేకపోతే, వీకెండ్ వచ్చిందంటే చాలు. బాబోయ్ ఉపన్యాసాలు. 'మా రాధి పిచ్చిమొద్దు. గొడ్డులా పనిచేస్తూంటుంది. దానికి హెల్ప్ చేయండి. కనీసం పిల్లలకి పాఠాలు చెప్పండి' అబ్బబ్బ ఇప్పుడు హాయిగా ఉంది" రమేష్ నవ్వుతూ చెప్పాడు.

"మీ వెటకారాలు చాలు కానీ, దీప ఏదో హాస్టల్‌లో ఉంటున్నానని చెప్పింది కదా. కొంచెం వెళ్ళి చూసి రారాదూ. మీకు పుణ్యం వస్తుంది." రాధిక బతిమాలింది.

"ఇంకా నయం. లేడీస్ హాస్టల్‌కి వెళ్ళడమే! ఐనా నగరంలో ఎన్ని హాస్టల్స్ ఉన్నాయో తెలుసా నీకు? ఒక్కోదానికి వెళ్ళి దీప గురించి ఎంక్వయిరీ చేయడం అంటే మాటలు కాదు" రమేష్ నిరాకరించాడు.

"పోనీ అది రీసెర్చ్ చేసే లేబ్‌కి వెళ్ళి కనుక్కోండి" రాధిక కళ్ళల్లో నీరూరుతుండగా అడిగింది.

"ఇంపాజిబుల్. ఏ గైడ్ దగ్గర చేస్తోందో, ఏ డిపార్ట్‌మెంటో తెలీకుండా ఎలా వెతుకుతాం? ఐనా సెలవు పెట్టి వెదికేంత టైం లేదు నాకు. పోనీ ఓ పని చెయ్. 'కనపడుటలేదు' అని ఈనాడులో ఫోటోతో ప్రకటన ఇవ్వు" రమేష్ బిగ్గరగా నవ్వాడు.

రాధిక కోపంగా అడుగులు టప టపా వేసుకుంటూ గదిలోకి వెళ్ళి తలుపు వేసుకుంది.

నాలుగు ఆదివారాలు వచ్చి వెళ్ళాయి. దీప మాత్రం రాలేదు. రాధిక దిగులు నెమ్మదిగా తగ్గుముఖం పట్టింది. దీప ఎవర్నో పెళ్ళి చేసుకుని వెళ్ళిపోయిందని ఆమె బలంగా నమ్మింది. కానీ తనకి చెప్పకుండా ఎందుకు మాయమైందో మాత్రం అర్థంకాలేదు. దీప అంతర్ధానం ఆమెని ముల్లులా గుచ్చుతూనే వుంది.

అంతా రొటీన్‌లో పడ్డారు. రాధిక ప్రతీరోజూ తప్పనిసరిగా ట్రెడ్‌మిల్ మీద ఓ గంట నడుస్తోంది. పిల్లలు స్వంతంగా చదువుకుంటున్నారు. రమేష్ ఆదివారాలు టెన్నిస్ ఆడుకోడానికి వెళ్తున్నాడు. రాధిక ఢిల్లీలోలా స్వతంత్రంగా పనులు చేసుకుంటోంది.

బేబీ బర్త్‌డే పదిరోజుల్లోకి వచ్చింది. ఇంకా డ్రెస్‌లు కొనలేదు. రిటన్ గిఫ్ట్స్ కూడా కొనాలి. రమేష్‌ని అడిగితే కుదరదు అని చెప్పాడు. దాంతో ఆ మధ్యాహ్నం షాపింగ్ మాల్‌కి వెళ్ళింది. బర్త్‌డే పార్టీకి కావలసినవి కొనుక్కుని రెండు చేతులనిండా కవర్లతో ఫుడ్ కోర్ట్‌లోకి వెళ్ళి కాఫీకి కూపన్ తీసుకుని ఓ ఖాళీ టేబుల్ ముందు కూర్చుని బిల్స్ చెక్ చేసి అన్నీ కరెక్ట్‌గా ఉన్నాయని తృప్తి పడింది. తన టోకెన్ నంబర్ వినపడగానే లేచి వెళ్ళి కాఫీ కప్ తీసుకుని తన టేబుల్ దగ్గరకి వెళ్తూ అనాలోచితంగా చుట్టూ చూసింది.

ఓ మూల వున్న టేబుల్ ముందు కూర్చుని ఎదుటి వ్యక్తితో నవ్వుతూ కబుర్లు చెప్తున్న దీప కనిపించింది. అప్రయత్నంగా ఆమె ముందు కూర్చున్నతన్ని చూసింది.

రమేష్!

తన సహజమైన చిరునవ్వుతో దీప చెప్పేది వింటున్నాడు.

తనని దీప ఎందుకు పిచ్చి మొద్దు అనేదో రాధికకి అర్థమైంది. అలాగే దీప తనింటికి రాకపోవడానికి, తనకి ఫోన్‌లో అందుబాటులో లేకపోవడానికి కూడా కారణం అర్థమైంది.

గిల్టీ!

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments